క్లుప్తంగా

కల్యాణం.. కమనీయం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వాల్మీకిపురం: స్థానిక శ్రీ పట్టాభిరామాలయంలో గురువారం శ్రీరాముడి జన్మ నక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. అనంతరం స్వామి వారికి అర్చన, అభిషేకం, తోమాలసేవ తదితర కార్యక్రమాల అనంతరం విశేష అలంకరణలో ముస్తాబైన ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలోని ఆస్థాన మండపంలో సంప్రదాయ బద్ధంగా తీసుకెళ్లి ఆశీనులు చేశారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగానిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి కృష్ణమూర్తి, నాగరాజ, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



తిప్పసానిపల్లెలో పూజలందుకుంటున్న దేవతా విగ్రహాలు

రామసముద్రం : రామసముద్రం మండలం పెద్దకురప్పల్లె పంచాయతీ తిప్పసానిపల్లెలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సీతారామ లక్ష్మణ ఆంజనేయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం గురువారం నుంచి ప్రారంభమైంది. ఉదయం కళశారాధన, అగ్నిప్రతిష్ట, పుణ్యాహవాచనం, మహాకుంభారాధన, గణపతి, నవగ్రహ హోమం నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలి వచ్చి పూజాకార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు తీసుకున్నారు. శుక్రవారం వైభవంగా స్వామివార్ల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించనట్లు నిర్వాహకులు తెలిపారు.

అమ్మపేరుతో మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న వార్డన్ వెంకటేష్

మదనపల్లె సిటీ: అమ్మపేరుతో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని స్థానిక బీసీ హాస్టల్ వార్డన్ వెంకటేష్ అన్నారు. గురువారం అమ్మపేరు మీద ఒక మొక్క నాటుదాం కార్యక్రమంలో భాగంగా స్థానిక బీసీ హాస్టల్ ఆవరణంలో మొక్కలు నాటారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయని మొక్కలు నాటితే త్వరగా పెరుగుతాయన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి పరిరక్షణకు కృషి చేయాలని ఆయన కోరారు. యూత్ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు ఏఆర్ సురేష్, ప్రభాకర్, మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై దృష్టి సారించండి



ఈఓ గురుమోహన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

పీలేరు : ప్రభుత్వ హాస్టళ్ల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృత్ తేజ కోరారు. గురువారం స్థానిక గ్రామ పంచాయతీ ఈఓ గురుమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సీజనల్ వ్యాధుల భారిన పడకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు సాయిసంపత్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు వంక ఆక్రమణ



పొలాలవైపు వెళుతున్న నీరు

గుర్రంకొండ: చెరువు వంక ఆక్రమణకు గురికావడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని గుర్రంకొండ పంచాయతీ దౌలత్‌ఖాన్‌పల్లెలో దిగువభాగాన సయ్యద్‌ఇమామ్ చెరువు ఉంది. సాధారణంగా వర్షాలు కురిసినప్పుడు గ్రామంలోని వర్షపు నీరు మొత్తం వంక ద్వారా చెరువులో కలిసేది. ప్రస్తుతం చెరువు వంక మొత్తం ఆక్రమణలకు గురైంది. కొన్ని చోట్ల వంక పూడిపోగా, మరోచోట వంక మొత్తాన్ని ఆక్రమించి కొందరు వ్యవసాయం చేసుకొంటున్నారు. దీంతో గ్రామంలోని వర్షపునీరు చెరువుకు చేరే మార్గం లేక ఇష్టానుసారం పొలాలపై పారుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా చెరువు వంక పూడికలు, ఆక్రమణలు తొలగించి వర్షపు నీరు చెరువుకు చేరే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఆధార్ కష్టాలు తీరేదెన్నడో..!

- ఆధార్ కేంద్రాలకు పరుగులు తీస్తున్న విద్యార్థులు
- ఇంటిపేరు అప్‌లోడ్ కాక అవస్థలు
- ఉన్నతాధికారులకు నివేదిక



ఆధార్‌కేంద్రం వద్ద క్యూ కట్టిన విద్యార్థులు

కలకడ : ఆధార్ కార్డు అంటేనే విద్యార్థులు హడలిపోతున్నారు. ఆధార్ సవరణకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆధార్ కార్డులో ఇంటి పేరు, పుట్టిన తేదీ నమోదు లేకపోయినా, చిన్నచిన్న పొరపాట్లు ఉన్నా 10 తరగతి పబ్లిక్ పరీక్షలు రాయలేమని తెలుసుకున్న విద్యార్థులు ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పుల కోసం ఆధార్ కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. గతంలో విద్యార్థులకు సంబంధించిన ధ్రువపత్రాలు ఆయా పాఠశాలల్లో నమోదు చేసేవారు. ఈ వివరాల ఆధారంగా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, పరీక్షల హాల్‌టికెట్లు ఇచ్చేవారు. అయితే ప్రస్తుత డిజిటల్ యుగంలో అందరి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొందాలన్నా.. ఇతర గుర్తింపు పత్రాలు తీసుకోవాలన్నా.. విద్యార్థులుపై చదువులకు వెళ్లాలన్నా.. ప్రస్తుతం పరీక్షలు రాయాలన్నా ఆధార్ తప్పనిసరి చేశారు.

విద్యార్థుల అవస్థలు

10వ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు ఫీజు చెల్లించేందుకు ఆధార్ నంబర్ నమోదుతో పాటు విద్యార్థి ఇంటి పేరును నమోదు చేయాలి. కానీ కొందరు విద్యార్థులకు ఇంటి పేరు వద్ద ఇంగ్లీష్‌లో ఇన్సల్ మాత్రమే ఉంది. దీంతో అప్‌లోడ్ కావడం లేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఆధార్ కార్డులో వివరాలు నమోదు చేసేటప్పుడు 18 సంవత్సరాల లోపు వారికి పుట్టిన తేదీ నమోదు చేయలేదు. ఇంటిపేరు లేకుండా కేవలం ఇంగ్లీష్ అక్షరంతో ముగించారు. ఇప్పుడు ఇంటి పేరు నమోదు చేస్తుంటే అప్‌లోడ్ కావడం లేదు. అప్‌లోడ్ కాకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. సమస్యను పరిష్కరించేందుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపామని మండల అధికారులు చెబుతున్నారు.

ఇంటిపేరుతో సమస్య



మండలంలోని కదిరాయచెర్వు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాను. పబ్లిక్ పరీక్షలు రాయడానికి ఇంటి పేరుతో, పాఠశాలలో నమోదైన ఆధార్‌కార్డునే తీసుకురావాలని, లేకుంటే ఆన్‌లైన్‌లో హాల్ టికెట్ రాదని ఉపాధ్యాయులు తెలిపారు. పుట్టిన ఆధార్ కార్డులో తప్పుగా నమోదు చేశారు. ఇప్పుడు ఆధార్ కేంద్రంలో ఇంటిపేరు, పుట్టిన తేదీ నమోదు కావడంలేదు. –ఎల్.శివసాయి, 10వ తరగతి విద్యార్థి, కదిరాయచెర్వు

ఆన్‌లైన్‌లో నమోదు కావడం లేదు



18 సంవత్సరాల లోపు వారికి కంప్యూటర్ ద్వారా పాఠశాల ధ్రువపత్రాలు స్కాన్ చేసిన ఇంటిపేరు, పుట్టిన తేదీ అప్‌లోడ్ చేసినా తీసుకోవడం లేదు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాత పూర్వకంగా ఇచ్చిన ధ్రువపత్రాలను స్కాన్ చేసి అప్‌లోడ్ చేసినా రిజక్ట్ అవుతుంది. దీంతో జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపాము.
అమీరుల్లా, కంప్యూటర్ ఆపరేటర్, ఆధార్ కేంద్రం, కలకడ

ఎదురుచూస్తున్నాం



10 వతరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు ఫీజు చెల్లించాలంటే ఆధార్ నెంబర్ నమోదుతో పాటు విద్యార్థి ఇంటి పేరు నమోదు చేయాలి. కానీ కొందరు విద్యార్థులకు ఇంటిపేరు వద్ద ఇంగ్లీష్‌లో ఇన్సల్ మాత్రమే ఉంది. దీంతో అప్‌లోడ్ కావడం లేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై ఉన్నతాధికారుల ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నాం.
మునీంద్రనాయక్, ఎంఈఓ, కలకడ

అండగా ఉంటాం.. అధైర్య పడొద్దు

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్

మదనపల్లె : వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని మదనపల్లె వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. గురువారం మదనపల్లె సబ్‌జైలులో అక్రమ కేసులో అరెస్టైన పుంగనూరు వైఎస్సార్ సీపీ నాయకులను స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. అనంతరం సబ్‌జైలు ఎదుట నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ పుంగనూరులో ఎంపీ మిథున్‌రెడ్డి పర్యటన సందర్భంగా జరిగిన ఘటనలో ఉద్దేశపూర్వకంగా పోలీసులు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టారని మండిపడ్డారు. ఎప్పటికైనా సత్యమే గెలుస్తుందని, కూటమిప్రభుత్వం అక్రమ కేసులను వైఎస్సార్‌సీపీ సమర్థవంతంగా ఎదుర్కొంటుందని స్పష్టం చేశారు. పార్టీ ఆధ్వర్యంలో అధికార పార్టీ అక్రమాలను ఎప్పటికప్పుడు ఎండగడుతామని, అక్రమకేసులకు, అరెస్టులకు భయపడేది లేదని తేల్చిచెప్పారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైఎస్సార్ సీపీనే విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన ఐదునెలలకే కూటమి ప్రభుత్వం ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకుందన్నారు. ప్రజలు అసంతృప్తితో రగిలిపోతున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ ఫలాలను, సమర్థవంతమైన పాలనను గుర్తుచేసుకుని తప్పుచేశామని ప్రజలు బాధపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనారిటీ నాయకులు ఫకృద్దీన్ షరీఫ్, బొమ్మనచెరువు సర్పంచ్ దండు కరుణాకర్‌రెడ్డి, కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్, నరిబాబాయ్, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పశుగణన పకడ్బందీగా నిర్వహించాలి



అఖిలభారత పశుగణన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ తదితరులు

మదనపల్లె : పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ప్రతి ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే పశుగణను పకడ్బందీగా నిర్వహించాలని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. గురువారం సబ్ కలెక్టరేట్‌లో 21వ అఖిల భారత పశుగణనకు సంబంధించిన పోస్టర్లను సబ్ కలెక్టరేట్ మేఘస్వరూప్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మదనపల్లె డివిజన్ పశుసంవర్ధకశాఖ డీడీ సత్యనారాయణ మాట్లాడుతూ పశుగణన ఈనెల 25 నుంచి 28, ఫిబ్రవరి, 2025 వరకు జరుగుతుందన్నారు. డివిజన్‌లో పశుగణన చేపట్టేందుకు పశుసంవర్ధకశాఖ సహాయకులు, ఇతరులను మొత్తం 84 మందిని ఎన్యూమరేటర్లుగా, 19 మంది పశువైద్యాధికారులను సూపర్‌వైజర్‌లుగా నియమించినట్లు తెలిపారు. పశుగణనలో భాగంగా పశువైద్య సిబ్బంది రైతుల ఇంటివద్దకు వచ్చినప్పుడు సహకరించి, వారికి ఉన్న పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు, పెంపుడు జంతువుల వివరాలను తెలపాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, తహసీల్దార్ ఖాజాబీ, ఏడీ విశ్వేశ్వర రెడ్డి, సీటీఎం వెటర్నరీ డాక్టర్ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే సైబర్ నేరాల నియంత్రణ



మాట్లాడుతున్న సీఐ గురునాథ్

కలకడ : ప్రజల్లో అవగాహనతోనే సైబర్ నేరాలను నియంత్రించవచ్చని కలకడ సీఐ గురునాథ్ అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవం పురస్కరించుకుని గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు అరికట్టడంలో యువత పాత్ర గురించి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత వ్యసనాలకు బానిసలు కావద్దని సూచించారు. సైబర్ నేరస్థులపై నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆధార్ వివరాలు, బ్యాంకు వివరాలు, వ్యక్తిగత వివరాలు ఎవరికి వెల్లడించరాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామాంజనేయులు, కళాశాల ప్రిన్సిపాల్ జయభారతి, వైస్ ప్రిన్సిపాల్ రమణయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పుష్పకుమారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీలు

పీలేరురూరల్ : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం సైబర్‌క్రైమ్ అంశంపై విద్యార్థులకు మండలస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ బాలకృష్ణ మాట్లాడుతూ వివిధ కళాశాలలు, పాఠశాలల నుంచి 94 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

మెరుగైన సేవలు అందించాలి

తంబళ్లపల్లె: ప్రభుత్వ ఆస్పత్రుల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరామయ్య సూచించారు. గురువారం తంబళ్లపల్లె, బి.కొత్తకోట ప్రభుత్వ ఆస్పత్రుల్లోని నర్సులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కేర్ కంపెయిన్ ప్రోగ్రాం ట్రైనర్ డాక్టర్ సంధ్య మాట్లాడుతూ గర్భిణులు సుఖ ప్రసవం అయ్యేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి నర్సులకు శిక్షణ ఇచ్చారు. గర్భిణులకు, బాలింతలకు ఆరోగ్య సూచనలిస్తూ ప్రతి నెలా అన్ని రకాల పరీక్షలు నిర్వహించుకునే విధంగా చైతన్య పరచాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగే విధంగా కృషి చేయాలని డాక్టర్ వెంకటరామయ్య చెప్పారు.

అంతర యూనివర్శిటీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మదనపల్లె : ఎస్వీ యూనివర్శిటీలో నిర్వహించిన అంతర యూనివర్శిటీ హాకీ, బాడ్మింటన్ పోటీల్లో శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచి పతకాలు సాధించారని కరస్పాండెంట్ డాక్టర్ రాటకొండ గురుప్రసాద్ తెలిపారు. గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా గురుప్రసాద్ మాట్లాడుతూ అంతర్ యూనివర్శిటీ హాకీ, బాడ్మింటన్ పోటీల్లో జ్ఞానాంబిక డిగ్రీకళాశాల ఫైనల్‌కు చేరుకుని రన్నర్స్‌గా నిలిచిందన్నారు. అలాగే షటిల్, బాడ్మింటన్ పోటీల్లో రన్నర్స్‌గా నిలిచి షీల్డ్ అందుకుందని పేర్కొన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ సురభి రమాదేవి, పీడీ శరత్‌నాయక్ అభినందించారు.

ప్రపంచ పోలియో దినోత్సవంపై ర్యాలీ

వాల్మీకిపురం: మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ జులేఖబేగం మాట్లాడుతూ అక్టోబరు 24న ప్రతి ఏడాది ప్రపంచ పోలియో దినోత్సవాన్ని కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించామని తెలిపారు. పుట్టిన శిశువు నుంచి 5 సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ శ్రీవిద్య, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, సిహెచ్‌వో ఇంద్రాణి, సూపర్‌వైజర్ సుధాకర్, భానుభి, హెచ్ఎం రెడ్డెప్ప రెడ్డి పాల్గొన్నారు.

ఆర్‌ఓబీల నిర్మాణం వేగవంతం చేయండి

పీలేరు : పట్టణంలో ఆర్‌ఓబీల నిర్మాణ పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఏడాదిగా ఆర్‌ఓబీల నిర్మాణ పనులు నత్త నడకన సాగుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఎండ కాస్తే రోడ్డుపై దుమ్ముధూళి విపరీతంగా వస్తోందని, వర్షం కురిస్తే రోడ్డు మొత్తం బురదమయంగా మారుతోందని చెప్పారు. సంబంధిత అధికారులు స్పందించి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ కొండయ్యనాయుడు

తంబళ్లపల్లె: మండలంలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు సూచించారు. గురువారం తంబళ్లపల్లె పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, నమోదైన కేసులు తదితర అంశాలపై ఆరా తీశారు. విధినిర్వహణలో ఎవరూ నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులతో స్నేహభావంతో మెలగాలని డీఎస్పీ తెలిపారు. అనంతరం ఇటీవల మృతి చెందిన ఎఎస్ఐ రెడ్డప్పనాయక్ కటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ములకలచెరువు సీఐ రాజారమేష్ ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



మధ్యాహ్న భోజన వివరాలను అడిగి తెలుసుకుంటున్న జడ్జి గురు అరవింద్

వాల్మీకిపురం: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి గురు అరవింద్ సూచించారు. గురువారం స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చుదువుకొని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. న్యాయవాదులు అశోక్ కుమార్ రెడ్డి, ఆనంద కుమార్, హెచ్ఎంలు సావిత్రి, శ్రీదేవి పాల్గొన్నారు.

దళితుల పట్ల చిన్నచూపు తగదు

కలకడ : దళితుల పట్ల చిన్నచూపు తగదని కలకడ మండలం మాలమహానాడు అధ్యక్షుడు రజినీకాంత్ అన్నారు. గురువారం కలకడ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాల్మీకిపురం పట్టణం గాంధీపేటకు చెందిన దళిత నాయకుడు రఘును వాల్మీకిపురం ఎస్ఐ అసభ్యపదజాలంతో దూషించడం హేయమైన చర్య అని అన్నారు. ప్రజా స్వామ్యంలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కును రాజ్యాంగం కల్పించిందని తెలిపారు. ఎస్ఐ తన పనితీరు మార్చుకోకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు మండలశాఖ ఉపాధ్యక్షుడు కె.నటరాజ్, కార్యదర్శి ఓబులేశు, ఆంజనేయులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయం

పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు



ఉదయం 7 గంటలకే మద్యాన్ని కొనుగోలు చేస్తున్న మద్యం ప్రియులు

మదనపల్లె : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రైవేట్ మద్యం పాలసీని తీసుకువచ్చిన విషయం తెలిసిందే. దీంతో మదనపల్లెలో మద్యం షాపులు, బార్లకు వేళాపాళా లేకుండా పోతోంది. ప్రభుత్వానికి లక్షల్లో దరఖాస్తు ఫీజు, డిపాజిట్లు కట్టేశామన్న ఆతృతతో రేయి, పగలు తేడా లేకుండా ఎడాపెడా మద్యం విక్రయాలు చేసేస్తూ, 24 గంటలు మందుబాబులను మత్తులో ముంచెత్తుతున్నారు. పట్టణంలోని ఆర్టీసీబస్టాండ్ సమీపంలో, టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు సమీపంలో ఉన్న నరసింహ బార్‌లో తెల్లవారుజామునే మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 వరకు బార్ పనివేళలు కొనసాగించాలి. అయితే నిబంధనలకు విరుద్ధంగా తెల్లవారుజామునే బార్‌లో మద్యం విక్రయాలు కొనసాగుతున్నా.. ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకపోవడంతో, అటుగా వెళుతున్న స్థానికులు మద్యం విక్రయాల ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేశారు. . మద్యం అమ్ముతున్న సమయాన్ని అధికారులు తెలుసుకునేందుకు వీలుగా జీపీఆర్ఎస్ లొకేషన్, లాంగిట్యూడ్, సమయం చూపుతూ ఫొటోలు తీసి మరీ పంపారు. నరసింహ బార్‌లో మద్యం విక్రయాలు 24 గంటలు జరుగుతున్నప్పటికీ, అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవు



గ్రామసభలో మాట్లాడుతున్న అధికారులు

కలకడ : గ్రామాల్లో ప్రభుత్వ భూములు, చెరువులు ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ పనికుమార్ హెచ్చరించారు. గురువారం మండలంలోని కలకడ కొత్తపల్లెలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కరించడానికే రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. భూమి సమస్యలకు సంబంధించి 12 మంది, ఇంటి స్థలాలకు సంబంధించి ఆరుగురు ఫిర్యాదు చేయగా సర్వే చేసి రికార్డుల్లో హద్దుల మేరకు కేటాయించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ దేవి, సచివాలయసిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా భూముల రీసర్వే

కేవీపల్లె : భూముల రీసర్వే పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ క్రాంతికుమార్ అన్నారు. గురువారం మండలంలోని బొప్పసముద్రంలో భూముల రీసర్వే గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భూముల రీ సర్వే సందర్భంగా సరిహద్దుల తప్పిదాలు, ఆన్‌లైన్‌లో ఒక పేరు, అనుభవంలో మరొక పేరు లాంటి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాంప్రసాద్‌నాయుడు, మండల సర్వేయర్ కీర్తన, గ్రామ సర్వేయర్ రమేష్‌బాబు, వీఆర్వో స్వర్ణలత, వీఆర్ఏ గోపి, రైతులు పాల్గొన్నారు.

ఎదుర్లగుట్ట ఆక్రమణ భూమి స్వాధీనం

సాక్షి ఎఫెక్ట్..



ప్రభుత్వ భూమిలోకి ఎవరూ ప్రవేశించవద్దని హెచ్చరిక బోర్డు పెట్టిన రెవెన్యూ అధికారులు

బి.కొత్తకోట: మండలంలోని శీలంవారిపల్లె పంచాయతీలోని ఎదుర్లగుట్టను ఆక్రమించడంపై బుధవారం సాక్షిలో ఎట్టా ఎదుర్లగుట్టకే ఎసరా అన్న శీర్షిక ప్రచురితమైన కథనంపై జాయింట్ కలెక్టర్ స్పందించిన విషయం తెలిసిందే. జేసీ ఆదేశాలతో రెవెన్యూ అధికారులు ఆక్రమణ భూమిని పరిశీలించారు. సర్వేనంబర్ల ఆధారంగా భూమి విస్తీర్ణం పరిశీలించారు. ఇందులో సర్వే నంబర్ 329లో 3.30 ఎకరాలు, సర్వే నంబర్ 891లో 1.35 ఎకరాలు, సర్వే నంబర్ 341లో 0.70 ఎకరాలు మొత్తం 5.35 ఎకరాలను చదును చేసి ఆక్రమించారని తేలింది. స్థానిక టీడీపీ నేత ఆక్రమణలోని భూమి, మిగిలిన భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని గురువారం ఆ భూమిలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ భూమిలో ఎవరూ ప్రవేశించకుండా, ఆక్రమించకుండా చూసుకునేందుకు ఇద్దరు వీఆర్ఏలకు బాధ్యతలు అప్పగించారు.

బాబోయ్.. కుక్కలు



రాజీవ్‌నగర్‌కాలనీలో గుంపులుగా సంచరిస్తున్న వీధికుక్కలు

కలకడ : పట్టణంలో రోజు రోజుకు పెరిగిపోతున్న కుక్కలబెడదతో జనం హడలిపోతున్నారు. బాబోయ్.. కుక్కలంటూ అటు వైపు వెళ్లా లంటేనే చిన్నారులు, వృద్ధులు, వాహనదారులు భయపడిపోతున్నారు. వీధుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ రోడ్ల పక్కన నడుచుకుంటూ వెళ్తున్న వారిపై దాడులు చేస్తున్నాయి. అలాగే ఇళ్ల ముందు ఆడుకుంటున్న పిల్లలు, రాత్రి వేళల్లో ఇళ్ల ముందు పడుకుంటున్న వారిపై దాడి చేసి కరుస్తున్నాయి. అలాగే ద్విచక్రవాహనదారులను వెంబడిస్తున్నాయి. దీంతో పలువురు గాయపడ్డారు. పంచాయతీ అధికారులు కుక్కలను ఊరికి దూరంగా వదులుతున్నా మళ్లీ కలకడలో తిష్టవేస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి వీధి కుక్కలను సుదూర ప్రాంతంలో వదలిపెట్టాలని కోరుతున్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

కలికిరి: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి బి.సోమశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్‌లు, మహాలక్ష్మి పథకం కింద 19 నుంచి 59 ఏళ్ల లోపు వయస్సు గల మహిళలకు నెలకు రూ.1,500 ఆర్థిక సాయం హామీలను వెంటనే అమలు చేయాలని బుధవారం కలికిరి ఆర్టీసీ బస్టాండ్ వద్ద కాంగ్రెస్ నేతలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు కూటమి ఇచ్చిన హామీలను నమ్మి గుంపగుత్తగా ఓట్లు వేసి గెలిపించారని, దీంతో వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దుబ్బ శ్రీకాంత్, శ్రీవర్ధన్ చౌదరి, హదిబ్, చాంద్‌బాషా, జగదీష్ పాల్గొన్నారు.

'తల్లికి వందనం' విడుదల చేయాలని ధర్నా

మదనపల్లె సిటీ: తల్లికి వందనం పథకాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా ఉప విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లికార్జున మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పథకం కింద పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని చెప్పడం జరిగిందన్నారు. గత నాలుగు నెలల నుంచి ఇదిగో తల్లికి వందనం అదిగో తల్లికి వందనం అంటూ విద్యాశాఖ మంత్రి లోకేష్ కల్లబొల్లి మాటలు చెబుతూ కాలం వెళ్ల దీస్తున్నారని మండిపడ్డారు. మంత్రి మండలి సమావేశంలో తల్లికి వందనం గురించి మాట్లాడకపోవడం దారుణమన్నారు. జిల్లా కన్వీనర్ నాగిరెడ్డి, నగర కార్యదర్శి కిషోర్‌కుమార్, గణేష్, మోహన్‌రాజ్ విద్యార్థులు పాల్గొన్నారు.